



కొందరు షంచలు, గాంధీ టోపీలూ పెట్టుకుని తిరుగుతున్న ప్రముఖులు దూరం నుంచి చూస్తే పూర్తి సువాసినుల్లా ఉన్నారు. జరిగేది రిపబ్లిక్ మీటింగేమో — మాట మాట చెప్పక్కర్లేకుండా ముందే రిహార్సల్స్ చేయించి లెఖ్ఖగా చప్పట్లు కొట్టించుకోవడం కొందరి అలవాటు). ముసిముసి నవ్వులూ. నవ్వులకి జతగా తిరిగి చప్పట్లు ఒకదాన్నొకటి డామినేట్ చేస్తున్నాయి. ప్రజలకు మాత్రం యివేం పట్టలేదు. వాళ్ళకంతా యిదేదో తీర్థంలా ఉంది. వాళ్ళంతట వాళ్ళొచ్చారో వాళ్ళని లాక్కొచ్చారో (కాఫీలూ టిఫిన్‌లూ ఫ్రీ ట్రాన్స్‌పోర్టూ యిచ్చినట్టు రూమర్) తెలియ లేదు. కొందరు పెవిలియన్లో బొమ్మల్నీ మరి కొందరు ఆ బొమ్మల కన్నా అందంగా తిరుగుతున్న ఆడ వాలంటీర్లనీ, యింకొందరు కేంటీన్లో టిఫిన్లనీ అరగిస్తున్నారు.

మధ్యాహ్నం జనం పల్చబడ్డ తర్వాత అక్కడ ఓ రహస్య సమావేశం జరిగింది. మెరిసిపోతున్న కళ్ళ జోడుతో ధగథగ లాడుతున్న బంగారు పన్నుతో జేబులో యింపోర్టెడ్ పెన్నుతో ఓ పెద్ద మనిషి యిలా అన్నాడు—

"మన పార్టీ ప్రజలకు దూరంగా వెళ్ళి పోతోంది. అందుకే గత ఎన్నికల్లో మన సీట్లు గల్లంతయ్యాయి. ఈసారి అలా కాకూడదు. ఎగస్పార్టీలని చిత్తుగా ఓడించాలంటే కొత్త కొత్త పద్ధతులు అవలంభించాలి. మనకి ప్రజల సహకారం అవసరం. వాళ్ళ సహకారం కావాలంటే ముందుగా విద్యార్థుల్ని మనవైపు తిప్పుకోవాలి. యువజనుల్ని ఆకట్టుకొని ఏ

పార్టీ చరిత్రలో ముందుకు రాలేదు. సత్యాగ్రహం చేసినా పికిటింగ్ లు చేసినా బంధ్‌లు నిర్వహించాలన్నా ఆఖరికి ప్రభుత్వాన్ని స్తంభింప చేయాలన్నా వాళ్ళు ముందుండాలి. వాళ్ళని ఆశీర్వదిస్తే చాలు—వెన్ను పట్టుకుని తిరుగుతారు. రెండు నెలల్లో మనం నిర్వహించబోయే 'ఆలిండియా బంధ్' దిగ్విజయం కావల్సి ఉంది. ఇందుకనే నేను వలంటీర్లనీ, మండలి ప్రతినిధుల్నీ ప్రోత్సహిస్తున్నాను."

* * *

"ఇతగాడే యూనివర్సిటీ స్టూడెంట్స్ లీడర్....ఎలక్షన్లలో ప్రెసిడెంటు పదవికి పోటీ చేశాడు. నెగ్గి తీరుతాడు. పేరు పరంజ్యోతి." గాంధీ టోపీ మరో టోపీకీ పరిచయం చేసింది.

"మీ పరిచయం నాకు ఆనందంగా ఉంది నాయనా! మేం చదువుకునే రోజులు గుర్తొస్తున్నాయి. ఆ రోజుల్లో ఇప్పట్లోలా వెలుగు తక్కువ. మేం పుస్తకాల పురుగులుగా బ్రతికాం. ఈవేళ మీ విద్యార్థుల్ని చూస్తే తిరిగి యీ రాజకీయాలు మానేసి చదువుకోవాలనిపిస్తోంది...."

"దానికే ముందండీ....రేపే జేరండి నైట్ కాలేజీలో."

"వీరి హయాంలో రాజకీయాల్లో కలగజేసుకుంటే ఇటు యింట్లో పెద్దలూ అటు కాలేజీ పెద్దలూ కూడా విరుచుకు పడేవారట."

"ఇప్పుడు బాధేం లేదు లెండి....స్టూడెంట్స్ వాయిస్‌కి ఘనంగా బలం ఉంది. సెనేట్ మెంబర్ పిస్ కూడా మాకోటివ్వాలని పట్టుబట్టాలనుకుంటున్నాం!"

పెద్ద టోపీ చిన్న టోపీకీ ఏదో సంజ్ఞ చేసింది. ఆ తరువాత పెద్ద టోపీ మనసు విప్పి పరంజ్యోతితో మాట్లాడింది. చేతులు పట్టుకుంది. కాళ్ళు పట్టుకుంది. భుజం నిమిరింది. తరువాత జాలిగా చూస్తూ, ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ వీధిలోకి వెళ్ళిపోయింది.

వెంటనే వీధిలోంచి చిన్న టోపీ వచ్చి ఓ పాకెట్ మరో సంచీ పరంజ్యోతి చేతిలో పెట్టి గురువులాగే మరింత ఆప్యాయతనీ నవ్వునీ చిందించుకుంటూ వీధిలోకి కప్ప దాటేసింది.

పరంజ్యోతికి ఒక పక్క ఆలోచన మరో పక్క ఆనందం కలగసాగాయి.

"అటు చూస్తే అప్పుల వాళ్ళూ, ఇటు చూస్తే ఉరితాడూ కన్పిస్తే మంచేవిటి చెడేవిటి అనే నిర్ధారణకి వచ్చేసినట్టు చుట్టూతా చూసి ఓ 'గ్లాన్స్' పాకెట్ మీదకి విసిరాడు.

* * *

ఆ రోజు మోడల్‌గా హైదరాబాద్‌లో బంధ్ జరుగుతోంది. స్కూళ్ళన్నీ బావురుమంటున్నాయి. విద్యార్థులు మాత్రం నీటుగా తయారయి వీధుల్లో పడ్డారు మేకల మందల్లాగా. ఆఫీసులకి వెళ్లాలా మానాలా అని మీమాంశలో పడ్డారు, ఉద్యోగస్తులు. ఉద్యోగినులకయితే మరీ భయంగా ఉంది. వీధిలోకి వెడితే చాలు 'బంధ్' అని జనం వెనకపడి తరుముతారు. మరీ మొరాయిస్తే 'చీర విప్పుతాం, రవికలు చించుతాం' అనే ధోరణిలో మాట్లాడతారు.

"సిటీ బస్‌లు కోఠీలో జోరుగా తిరుగుతున్నాయి గురూ!" ఒకడు అరిచాడు.

"రామ్‌కోటీలో మన వలంటీర్లేం చేస్తోన్నట్టు? సుల్తాన్ బజార్ వింగ్ నిద్రపోతోందా?"

"అక్కడ పోలీసు కమీషనర్ స్వయముగా నిలబడ్డాడు."

"అయితే ఆబిడ్స్‌లో రెండు బస్‌లకి నిప్పు పెట్టమని కబురు చేయి. భయపడవద్దని చెప్పు. చూద్దాం-దెబ్బకి బస్‌లు ఆగుతాయి."

"హలో—నారాయణ గూడాలో మనకి ఎగినెస్ట్‌గా లేడీస్ వర్క్ చేస్తున్నారు."

"లేడీసా....అంటే వూరి జనమా స్టూడెంట్సా?"

"యూనివర్సిటీ వాళ్ళు! వాళ్ళకి సౌమ్య లీడర్....గీతా, కుసుమా వెనక."

పరంజ్యోతికి కళ్ళు ఎర్రబడ్డాయి—"ఇదిగో మిస్టర్, థౌజండ్ రుపీస్.... నలుగురి గుండాల్ని పదిమంది బేవార్సు రకాల్ని ఆ వెధవల మీదకి పంపు. చీర విప్పి మనకి గుర్తుగా పంపాలని చెప్పు."

"కింగ్స్‌వేలో లాఠీ చార్జి....'చార్మినార్ దగ్గర రెండు బస్‌లు దగ్ధం.... నయాపూల్ దగ్గర విద్యార్థుల అరెస్ట్.... మార్కెట్ దగ్గర సూపర్నెంటు మొహం బద్దలు....గౌలి గూడాలో దుకాణాలు అంటుకున్నాయి."

పోలీసుల వీరవిహారం; విద్యార్థుల ఎదురు పోరాటం; మధ్య మధ్య మద్దత్తుదారుల ధైర్య వాచకాలు. అంతా ఆదో లోకం....కాదు అధో లోకం....కాదు అంధ లోకం....

* * *

"నువ్వు తప్పకుండా నెగ్గే వాడివేరా! ఆ పరంజ్యోతిగాడు ఆడపిల్లల్నందర్నీ భయపెట్టేశాట్ట - వోట్లు వేయకపోతే ఏం చేస్తానో చూడండంటూ."

"మంచితనంతో నెగ్గడం కష్టంరా.... ఇదేం. గాంధీ యుగం ఏమిటీ?"

"వాడికిప్పుడు కిందా మీదా తెలియడం లేదు. కారూ స్కూటరూ అంతా వ్యవహారం."

"వాడి కన్నా అర్హతలున్న మన విశ్వం ఓడిపోవడం మనం సహించ కూడదు. దెబ్బకు దెబ్బ తీయాలి....''

మరో స్నేహితుడన్నాడు ''వచ్చే సెల్లో వాడు మళ్ళీ స్ట్రయిక్ చేస్తాడని విని కిడి! దాన్ని మనం తిప్పి కొట్టాలి ''

''ఎలారా!''

''ఏమిటోయ్ విశ్వం! మినిస్ట్రీలో మీ ఫాదర్‌కి పలుకుబడి ఉంది. యూనివర్సిటీ గ్రాంటు కమీషన్ సిఫార్సులు అమ్లయి చేయడం లేదని ప్రొఫెసర్లందరూ ఏడుస్తున్నారాయే! మనం సాలర్ షిప్‌లూ ఎక్కువ చేయాలనో ప్రోగ్రామ్స్ ఫీజు యెట్‌నార్‌మల్ అనో గొడవ చేద్దాం.... రెండు రోజులు నువ్వు నిరాహార దీక్ష చేయి! మూడో రోజు మంత్రిగారు రాయబారానికి వస్తారు. వైస్ ఛాన్సలర్ కలగ జేసుకుంటారు. మనతో రాజీకి వస్తారు. నువ్వు కొబ్బరి నీళ్లు సిప్ చేస్తూ ఫొటో దిగుదువు గాని....''

విశ్వం తలలో రంగుల కలలు గిర గిర్లాడుతున్నాయి. అవును-సురేఖ కూడా అప్పుడు ఎప్రీషియేట్ చేస్తుంది.

విశ్వం యింటికి వెళ్ళేసరికి ఆడబోయిన తీర్థం ఎదురయినట్టు ఓ యిద్దరు ఎక్స్ ఎం. యల్. ఏ లు అతని కోసం ఎదురు చూస్తున్నారు. విశ్వాన్ని చూసి నమస్కారం చేశారు.

''మీరు....'' అన్నాడు విశ్వం వింతగా చూసి

ఆ తరువాత వాళ్ళెవరో ఎందుకొచ్చారో అతి నిమ్మళంగా చెప్పారు. విశ్వం వాళ్ళిద్దర్నీ చూశాడు. అతనికా సమయంలో వాళ్ళిద్దరు ఎక్స్ ఎం. యల్. ఏలుగా కాక యమభటుల్లా కనబడ్డారు. ప్రజాసేవకుల్లా కాకుండా ప్రజా హంతకుల్లా అన్పించారు.

''నేను విద్యార్థిని... మీ మధ్య గొడవల కోసం యివన్నీ చేయడం బాగుండదు. అందులో అతను నాతోటి స్టూడెంట్."

వాళ్ళు నవ్వేశారు.

''మాకంతా తెలుసయ్యా! వాడు ప్రజాద్రోహి....ప్రజల్ని రెచ్చగొట్టి తప్పు దారుల్ని పట్టేస్తున్నాడు. ఇలాంటి వాళ్ళు పలుకుబడి పెంచుకుంటే రేపు మనం తినేది మట్టే....''

వాళ్ళు ఎన్నో చెప్పి వెళ్ళిపోయారు. వెళ్ళిపోయే ముందు గుర్తుగా ఓ తోలు సంచీని అక్కడ వదిలి పెట్టారు.

విశ్వం కళ్ళు బైర్లు కమ్మాయి. తను ఎక్కడికి వెళ్ళాలనుకున్నాడో ఎక్కడికి వెళుతున్నాడో ఆలోచించ బుద్ధి కాలేదు ఆ సమయంలో....

* * *

పరంజ్యోతి చావుదెబ్బలు తిన్నాడన్న వార్త నిముషాల్లో నగరం అంతా వ్యాపించి పోయింది. అంతే—గాంధీ పోయాడన్న రోజు కూడా అంత విషాదం దేశంలో ప్రవహించలేదేమో అన్నట్టుగా ఉంది.... ఆ రోజు టెన్షన్ ఎంతటిదీ అని ప్రజలు ఆలోచించి బేరీజు వేసుకునేటట్టు చేసింది. పరంజ్యోతి కోలుకోవాలని విద్యార్థులు మూడు మైళ్ళ ప్రొసెషన్ లేవదీశారు. కొట్లు మూయాలన్నారు. మూయకపోతే వాళ్ళ నోళ్లు మూస్తామన్నారు. గవర్నర్‌కి లిఖితపూర్వకంగా 'మెమొరాండం' సమర్పించాలి. పది గవర్నమెంట్ బస్సుల్నీ, ఆయుదారు అంబాసిడర్ కార్లనీ చిత్తు చేశారు....అమ్మకం కొనుగోలూ కూడా స్థంభించిపోయాయి.

''ప్రభుత్వం వెంటనే ఎంక్వయిరీ కమిటీని వేయించాలన్నారు'' కొందరు.

''కాదు, యీ పని చేయించింది ప్రభుత్వమే" అన్నారు మరికొందరు.

''ప్రధాన మంత్రికి తంతి యివ్వండి'' అన్నారు ఎవరో.

వరంగల్లో, కరీమ్ నగర్ లలో బ్రహ్మాండమైన హర్తాల్ జరపనున్నట్టు అక్కడి విద్యార్థి సంఘాలు హుటాహుటిగా నిర్ణయించాయి.

ఎక్కడ చూసినా బీదర, భయం, అసహ్యం, పోలీసులు, లాఠీలు, తగల బడుతున్న బస్‌లు యివే. సామాన్య మానవుడు మాత్రం ఆ రోజు జీవనాన్ని స్థంభింపజేసుకుని 'కిం' మనకుండా కడుపులో కాళ్ళు పెట్టుకుని పడుకోవడానికి నిర్ధారణ చేసుకున్నాడు. స్కూల్ లేనందుకు ఆర్భాటంగా పిల్లలూ, ఆఫీసులు లేనందుకు గప్‌చుప్‌గా ఉద్యోగస్తులూ రోజుని గడిపారు. ఒకరోజు విషాదంతో ప్రపంచం, కొందరి హృదయాల్లోని చీకటితో దేశం; మునిగి పోవడం జరగదు కాబట్టి ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు.

కానీ ఆ విషాదం చీకటే కొందర్ని దారుణంగానే హింపిస్తుందంటే కన్నీరు కెరుక్కుమంటుంది. అదే అయ్యింది....

* * *

విశాలనే యం. ఏ. ప్రీవియస్ స్టూడెంట్ హుసేన్ సాగరంలో పడి చనిపోయిందంటే ఎవరికి తోచిన కారణాన్ని వాళ్ళు చెప్పారు. ప్రేమించిన వాడు దగా చేశాడన్నారు కొందరు పెద్దలు. కాదు- ప్రేమించిన వాణ్ణి పక్కన పెట్టుకుని మరొకడితో కులికుంటుంది. అందుకే వాడు చంపేసి ఉంటాడు అన్నారు విద్యార్థులు. దాని తరహాయే అంత అన్నారు తోటి యువతులు.

ఎవరేం అన్నా ప్రచారం చేసినా జరిగి ది మాత్రం యిది.

పరంజ్యోతి దెబ్బలు తిని ఆస్పటల్లో జేరిన మర్నాడు యూనివర్సిటీ కాంపౌండు

కురుక్షేత్రంగా మారిపోయింది. చదువుకుందామని వెళ్ళిన వాళ్ళ జనాభా ఒక్కసారి మూమెంట్ ని వాచ్ చేయాలనే మంద ఎక్కువతో టెన్షన్ పెరిగి పోయింది. నల్లజెండాలూ దారికడ్డంగా చెదురుమొదురుగా స్టాప్....శ్మశానంలా తయారయింది వాతావరణం.

నాలుగు పోలీస్ వాన్‌లు వచ్చాయి. నాలుగు వందలమంది పోలీసులు దిగారు. హాస్టల్ బిల్డింగ్స్‌ని చుట్టుముట్టారు.... అధైర్యవంతులు చెట్టు చాటుల్కి వెళ్ళి నక్కుతూంటే ధైర్యవంతులు గుట్టల మాటున కాపేశారు. పది నిముషాల్లో నలు వైపులనుంచీ రాళ్ళ వర్షం.... ఆపైన లాఠీల చప్పుడు! ఓ గంట వియత్నాంలా, కొరియాలా, తూర్పు బెంగాల్లా మారి పోయింది వాతావరణం. తరువాత ఇరవై మంది కుర్రాళ్ళని అరవై మంది పోలీసులు పట్టుకెళ్ళి వాన్‌లలో పడేశారు.

అదే రాత్రి విశ్వం యింటికి పది మంది మెరికల్లాటి విద్యార్థులు వెళ్ళి తలుపు తట్టారు. ఊరిలో భయం వరదలా మారి యింటిలోకి చొచ్చుకు వస్తూంటే ఆ యింటి యిల్లాలు తలుపు తీయవద్దని మొత్తుకుంది. దురదృష్టం, ఆపైన తోసుకు వచ్చే మృత్యువుని ఆపలేక కాబోలు ధైర్యంగా విశాల తలుపు తెరిచింది. అంతే....ఇద్దరు ఆమె నోరు నొక్కారు. మరిద్దరు కాళ్ళూ చేతులూ పట్టుకున్నారు. 'ఏమైందే విశాలా' అంటూ తడుముకుంటూ వస్తున్న ముసలితల్లిని మరొకడు వికృతంగా పడగొట్టారు.... సోఫా సెట్ల మీద కిరసనాయిల్ పోసి నిప్పు పెట్టారు. ఏం జరగబోతోందో ఎవరికీ తెలియడం లేదు....

అదే రాత్రి—పాపం పుణ్యాలు తెలియని; పోలిటిక్స్ కొద్దిగా కూడా చదువుకోని: అందరితో మిసమిస లాడుతున్న వయసులో తెర లాడుతున్న విశాల అనే



* జ్యోతి *

విశ్వం చెల్లెలు; కొందరిలో కోపానికి ద్వేషానికి. రగుల్కొనే కామానికి బలి అయింది. ఆపైన శోష వచ్చి వంట్లో శక్తి నశించి జీవితం మీద ఆశ చచ్చిన ఆ అమ్మాయిని హుసేన్ సాగర్‌లో పారేశారు.

ఈ దారుణం చేసిన వాళ్ళకి పేర్లు లేవు. వాళ్ళ హృదయాల్లో పాపభీతి లేదు.... విన్నవాళ్ళకి మాత్రం ఆ క్షణం జాలి కలిగింది ఏమిటో పాడు రోజులు అనుకున్నారు నిర్లిప్తతతో. అంతకు మించి మాత్రం కలగజేసుకో లేదు. పోలీసులు ఎవరూ వచ్చి నానా రసభ చేసి కేసు రిజిస్టర్ చేసుకున్నారు.

* • *

పేపర్లో చెల్లెలి వార్త విన్న విశ్వం నిలువునా కూలిపోయాడు. పెళ్ళి కుదిరిన చెల్లెలి కోసం తనీ వన్నలోకి దిగాడు. కళ్ళ ముందు కనకం కన్పిస్తూంటే వెనక ముందులు ఆలోచించుకోలేక పోయాడు. తనేం చేశాడు? ఎవరి కోసం యింత హింసనీ, అసహ్యాన్నీ ప్రేమించాడు? తన చేతి రాళ్ళు, తన వాళ్ళ చేత అవమానాలూ తగిలి ఎందరో ఏడ్చి ఉంటారు. అమాయకుల కన్నీళ్ళు అగ్ని కణాలై తన చెల్లెల్ని బలి తీసుకున్నాయి ఆఖరికి. వెంకయ్యగారి మాట విని పుల్లయ్యగారి మతాని ద్వేషించడానికి ముందుకు వెళ్ళడం తనదే తప్పు. ఇద్దరు పొట్టేళ్ళ మధ్య యిరుక్కోవడం తన నేరం. ఈ దేశాన్ని యీ సంఘాన్ని ఎవరు పాలిస్తే తనకేం? నెల క్రితం వరకూ లేని రాక్షసత్వాన్ని డబ్బుతో అలవాటు చేసుకున్నాడు. తన తోటి మనిషి పరంజ్యోతిని కారణం లేకుండా ద్వేషించాడు. ప్రేమించడం తెలియని తనకి అందుకే శిక్ష పడింది.... ప్రజల్ని హింసించినందుకు విధి తనని విశాల మరణంతో మనిషిని కమ్మని హెచ్చరిస్తోంది.

విశ్వం తలొంచుకున్నాడు. కళ్ళ ముందు కాలిపోయి వికృతంగా కన్పిస్తున్న యిల్లు కదిలాడింది.

కణతలు పగిలి పోతున్నాయి. నెత్తి మీద—కాదు సుతిమెత్తని హృదయం మీద. ఎవరో సుత్తులతో మోదుతున్నట్టుగా ఉంది. వళ్ళంతా పట్లు తప్పి పోతోంది....తనని చిత్తు చేసి ఎక్కడికో విసిరి వేస్తున్నారు. అవును—అరణ్యంలో పడ్డాడు తను.

చుట్టూ సింహాలూ ఏనుగులూ పులులూ....ఇది మనుషులు మసిలే ప్రదేశం కాదు. తను ప్రయాణం చేయాలనుకున్నది యిక్కడికి కానే కాదు....తను అభ్యుదయం వైపు-కాంతి వైపు వెళ్ళాలనుకున్నాడు. ఇదే మాట ఆ అమ్మాయికి కూడా చెప్పాడు ఇద్దరూ ఎం. ఎ పూర్తిచేసి చదువుకి మంగళ హారతి పాడి జీవితాలకి శ్రీకారం చుట్టాలని నిర్ణయించుకున్నారు. సంవత్సరాల తరబడి విసుగనిపించని చదువు — ఈ నిర్ణయానికి వచ్చిన తర్వాత పొడుగ్గా-కాదు వామనుడిలా పెరిగి పోతోన్నట్టని పించింది యిద్దరికీ కూడా....కలిపి నడవడం, కలిసి నవ్వుకోవడం ప్రారంభించి నాలుగు నెల లవుతోంది.

అలాంటిది జీవితం ఒక్క వుప్పెన దెబ్బ తిన్నట్టు దారి తప్పినట్టు గమ్యం తప్పింది. ఈ కళ్ళ ముందు అన్ని పన్లు జరుగుతున్నా సహించడం మనసుకు వ్యతిరేకమైన కార్యాలకి వత్తాసు పలకడం అలవాటైపోయింది. మెట్లు దిగుతున్నట్టు ఒక్కొక్క అడుగూ కిందకే నడిచాడు. తనకి తెలుసు—పైకి వెళ్ళడం కష్టం కిందకి పడ్డం సులువని. తేరుకుని చూసే టప్పటికి చుట్టూ అగాధం! కను-కాదు, అగాధంలో యింకా మునగలేదు. సమయానికి ఆ గాజుల చేయి సున్నితపు సుతారపు వేళ్ళూ తనని ఆప చేశాయి. లేకపోతే తనూ అగాధంలో పడి మృగంగా మారేవాడు.

అబ్బ...తనలో యిన్ని దుశ్చింతలకి తావుందని తనకి తెలియనే లేదు. ఇంత కర్కశంగా ప్రవర్తించగలడని వూహించనైనా వూహించలేక పోయాడు.

ఎందుకు చేసినట్టు? ఏమిటీ తన గమ్యం? ఏమిటి తన ఆదర్శం....అంతా ఎండమావి తప్ప మరేం లేదు. ఆత్మాశ తప్ప ఆదర్శం కానే కాదు. ఈ రోజెందుకో విశ్వరూప సందర్శనం అయినట్టుగా ఉంది....

కళ్ళు విప్పి చూశాడు. నర్సు తన పల్స్ చూస్తూ కనిపించింది.

"లేచేరే!...." అంది నవ్వుతూ నర్సు.

"ఏం? లేవకూడదా?" పరంజ్యోతి కూడా నవ్వుతూనే అడిగాడు.

"త్వరగా రికవర్ అయ్యారు. అంతే చాలు. లేకపోతే మీ ఫ్రెండ్స్‌కి జవాబులు చెప్పలేక మా ప్రాణాలు పోతున్నాయి."

"మీ ఋణం వుంచుకోను లెండి."

"మరో విధంగా వద్దు సుమా!...." చిలిపిగా నవ్వింది నర్సు.

పరంజ్యోతి టేబుల్ మీద పేపర్ తీసుకుని హెడ్డింగ్స్ చూస్తున్నాడు. కింద మీదా చూస్తున్నాడు. ఒకచోట అతని దృష్టి ఆగిపోయింది....గుండె వేగం పది రెట్లు పెరిగింది.

"సిస్టర్!" అనగలిగాడు. అంతే!

అప్పుడు-అతని సుకుమారపు హృదయంలో, ఆశల గూడులో పదిలంగా దాచుకున్న ఒకే ఒక అందాల బొమ్మ—తను సృష్టించిన సుడిగాలికీ, తను తల పెట్టిన పశుత్వానికీ బలి అయ్యిందేమో నన్న అనుమానం దహించడం మొదలు పెట్టింది. విశాల మీద యిటువంటి అఘాయిత్యం చేయడానికి ఎవరికి కలిగింది ధైర్యం! విశ్వం తనకి శత్రువైనా తనెప్పుడూ విశాల గురించి ఎవరికీ చెడుగా చెప్పలేదే! కానీ విశాల తన ముఠావాళ్ళ క్రౌర్యానికే ఎరగా మారిందని తెలిస్తే పరంజ్యోతి ఏమవుతాడన్నది అనూహ్యం. పరంజ్యోతి అలసటతో, బాధతో ఫిట్ వచ్చి తెలివి తప్పాడు.

* * *

ఆ రోజు యూనివర్సిటీ అంతా పెళ్ళి వారిల్లులా అలంకరించారు.

ఎక్కడ చూసినా జెండాలు తోరణాలు కన్ను కుట్టేటట్టు దీపాలు....ఆ దీపాలకి వెలుగుగా విలిచే అందాల భామలు....భామల చుట్టూ వేల సంఖ్య మీద విద్యార్థులు....అంటే ఆరోజు కాన్వకేషన్ డే!

ఢిల్లీ నుంచి అతిరధులూ మహారధులూ ప్రభుత్వం తరపు నుంచి ప్రభువులూ మహాప్రభువులూ వచ్చారు.

వాళ్ళకోసం వాళ్ళ ప్రాపుకోసం వాళ్ళవాళ్ళ బంధువులు బంధువుల సంతానాలు. సంతానాల స్నేహితులు, ఈ జనం కోసం పోలీసులు. యస్. ఐ. లు, సి. ఐ. లు అప్పటికది బృందావనం కావచ్చు, యమునాతీరం కావచ్చు. అంతా అత్యద్భుతంగా వుంది. యెవరి డిగ్రీలు వాళ్ళకిచ్చి చేతులు కడుక్కోకుండా డిగ్రీ లిచ్చిన పెద్ద మనిషి విద్యార్థులకు హిత వుగా నాలుగువాక్యా లంటూ మొదలుపెట్టి నాలుగు పేజీల లిఖిత కవిత చదవడం మొదలుపెట్టాడు.

---

* "ఏమిటోయ్! మీ ఆయనకు చెముడటగా— పెళ్ళికి ముందు నీకా సంగతి తెలియదా?"

"చెముడైతే బాగానే వుండును-బ్రహ్మచెముడు-మొన్న మన ఫేక్టరీలో ఏదో పేలిందిగా-అప్పుడు మా ఆవిడ లేచి నన్ను దగ్గుకు మందు వేసుకోమని అర గంట ఉపదేశించింది.'

— ఆదూరి సత్యవతీదేవి, విశాఖ.

"ప్రియ విద్యార్థులారా (విద్యార్థినులారా అని కూడా అన్నాడు) యీరోజుతో మీ మీద గురుతరమైన బాధ్యత పడుతోంది. యింత కాలం విద్యార్జన పేరుతో బాధ్యతారహితంగా బ్రతికారు. కానీ రేపటినుంచి మీరూ - దేశావసర వుత్పత్తిని పెంపొందించే జనాభాలో ఒకరిగా మారతారు.



మన వుత్పత్తులే మన దేశ భవిష్యత్‌కి పెట్టనిగోడలు. మనం ఐకమత్యం. సత్యశీలత. పరమత సహనం పెంపొందించుకోవాలి." అంటితో ఆయన వుపన్యాసం ఆపితే చాల బావుండేది కానీ ఆపలేదు, ఇంకా మాట్లాడాడు.

"విద్యార్థులు రాజకీయాల్లో ప్రముఖ పాత్రవహిస్తే బావుంటుందని నా మటుకు నా కనిపిస్తుంది. యెందుకంటే దేశ భవిష్యత్‌కి రాజకీయాలు హమేషా అవసరం. ప్రజల్లోకి వెళ్ళి వాళ్ళ బాధల్ని సమస్యల్నీ తెలుసుకుని బాగా అవగాహన చేసుకున్న నాడుగానీ వాళ్ళకి సేవ చేయడం కుదరదు. మీ రెవరూ కూడా మాస్తా చదువులు చదవొద్దు. దేశ సౌభాగ్యాన్ని పెంచడానికి చదవండి. విద్యార్థులకీ యూనివర్శిటీ అధికారులకీ రాజకీయ నాయకులకీ మధ్య అవగాహన లేని మూలంగానే యెక్కడ చూసినా స్ట్రయికులు, బంద్‌లూ జరుగుతున్నాయని నా అనుమానం." ఇలా వుపన్యాసం సాగిసాగి యెవరికీ అంతుపట్టకుండా చీకట్లోకి తుర్రుమంది.

మర్నాడు పేపర్లో ప్రభుత్వేతర నాయకులకీ ప్రభుత్వవర్గం వారికీ ప్రెస్ క్లబ్‌వాళ్ళు నిర్వహించిన ఫెరంలో గాంధీ టోపీలూ ఎక్స్ ఎమ్మెల్యేలు మాట్లాడిన వుపన్యాస సారాంశం పడింది.

"ప్రభుత్వం తన దోపిడీ విధానాల్నీ సమర్థించుకుంటూ పది కాలాల పాటు రాజ్యం చేయడానికి విద్యార్థులని ఆకట్టుకొనడం అన్యాయం. చదువుకున్నే వయసంటే వికసిస్తున్న పువ్వులాంటిది. దానిమీద యే ధూళీ మరకలూ పడకూడదు. దేశసౌభాగ్యానికి పట్టుకొమ్మలైన విద్యార్థులు-నాయకుల మోసపు మాటలు నమ్మి రాజకీయపు రొచ్చులో పడరాదు. రవీంద్రనాథ్ టాగూర్‌లాంటి ప్రముఖులు - విద్యార్థులు రాజకీయాలకు దూరంగాఉండాలని— ఉంచాలని ఎప్పుడో చెప్పారుట."

దొంగనోట్ల మార్పిడిలూ, విద్యార్థులని స్ట్రయిక్‌కి యినిస్టిగేట్ చేయడంలో ప్రభుత్వం ఆస్తిని నష్టపరచడంలో ఆడవాళ్ళని బాధించడంలో నేరస్థులుగా నిర్ణయింపబడి సింపిల్ యింప్రిజన్‌మెంటులో వున్న పరంజ్యోతిగానీ విశ్వంగానీ పేపర్‌లో గాంధీ టోపీల యెక్స్ యం. యల్. ఏ. ల వుపన్యాసం చదవలేదు. అందమైనవాళ్ళఫొటోలు కూడా చూడలేదు.

కానీ వాళ్ళకి తెలిసింది-ఆ నోటా, ఆ నోటా విన్నదీనూ సెంట్రీ చెప్పినమాటలు మాత్రమే.

యూనివర్శిటీలో ప్రెసిడెంట్ ఎలక్షన్ల హడావిడిట.నానా గోలగానూ వుందిట. దొమ్ములాటలు జరుగుగుతున్నాయట. అరెస్టులూ లాఠీచార్జీలు చేస్తున్నారుట "యేమిటో పాడుదేశం" అంటూ ముక్తాయింపు మాటలుగా చెప్పి బీడీ వెలిగించాట సెంట్రీ.

